# ఉద్యోగం వచ్చింది



రచన; కుమారి ఓగిరాల దుర్గామహాలక్ష్మి

'హ్హాష్... అబ్బా... పండుగనాడు కూడా ఆ దోసకాయకూర ఏమిటమ్మా? అందులో కేలరీలయితే శరీరానికి మంచివే కాని తినను అని నాలుక సమ్మెచేస్తుంది.' ఈ విమర్శ విని 'వెయ్యనా? వద్దా?' అని సందేహంగా చూచింది, కూరవడ్డించబోతున్న వదిన. 'సరే! రెండు ముక్కలుపడెయ్యమ్మా! పండుగ నాడు కూర లేకుండా ఆ భోజనమేమిటని అమ్మచేత కేకలెందుకు?'

'ఏమిటి అది ఆవకాయే!' మోహినీదేవి అమృత కలశంతో వస్తున్నట్లుగా అక్కయ్య ఆవకాయ జాడీతో వస్తూ 'వద్దంటావా' అంది. 'అయ్యో ఆదేమిటి అమృతమన్నా వద్దన్నొచ్చుగాని, ఆవకాయవద్దనొచ్చా! తప్పు, తప్పు నష్టపరిహారంగా మరికాస్త ఆవకాయవేసి వెళ్ళు'

అమ్మా! తల్లీ! చెల్లీ! ఎందుకమ్మా ఆ ముద్దపప్పు—వారం రోజులనుండి కడుపునొప్పితో చస్తుంటే మళ్ళీ పప్పుతో ప్రత్యక్షమయ్యావు. ఓ గరిటెడు విదిలించి వెళ్ళు'

'ఓసి! అలా కూర్చోకపోతే నువ్వుకూడా వడ్డనచేయరాదుటే! అందరూ త్వరగా కూర్చోవచ్చు' అమ్మ ఆజ్ఞ.

'హుష్! ఉండమ్మా! ఇంత మటుకు పోష్టురాలేదని బెంగతో, నే చస్తుంటే ఇప్పటికే రెండుసార్లు వెళ్ళి వచ్చాను ఏ కాఫీ హోటల్లో పడున్నాడో! ఇప్పుడు రాగానే నాలుగు దులిపాలి.' ఇదుగో రానేవచ్చాడు. 'ఏం! నాయనా ఎంతసేపు ఉత్తరాలివ్వటానికి. అయినా నిన్నని ఏం లాభం? రేపు దసరా మామూలు ఇవ్వాలిగా అప్పుడు చూస్తాను.'

బాబాయిదగ్గర నుండి వచ్చిన కవరు విప్పాను. సంగ్రహంగా ఉత్తరంలో సారాంశం. 'అక్కయ్యకు ఉద్యోగంవచ్చింది, నిన్ననే జాయిన్ అయింది' మిగిలిన ఉత్తరాలన్నీ చదవకుండా డైరీలో పెట్టి 'ఉద్యోగం వచ్చింది'

'ఉద్యోగం వచ్చిందని' సంగీతంలా కేకలు పెడుతూ, మంచినీళ్ళ గ్లాసుల్ని డ్యాన్సుచేస్తున్నట్లు తన్నుకుంటూ నీళ్ళన్నీ ఒంపేశాను. 'ఎవరికే' అందరూ 'ఎవరికేమిటో! అక్కయ్యకే!' బాబాయి వ్రాశారు. అందరితో చెప్పమన్నారు.' 'ఒరేయి ఫాదరూ!' కేక పెట్టింతర్వాత గుర్తొచ్చింది. అక్కడే బావా వాళ్ళందరూ ఉన్నారని.

'అమ్మా! అట్లా వెళ్ళి పెద్ద బాబాయి గారింట్లో చెప్పొస్తానే'

'భోజనం చేసి పోవే!' అమ్మకేక.

'ఆ! ఏం, భోజనమో? ఆ గ్లాసులో కాస్త పరమాన్నం పోసి ఇలా ఇవ్వు!'

'అబ్బా! ఏమిటే తీపి చాల్లేదు.'

'తీపి చాలకపోవటము ఏమిటే! నీకు తీపి ఎక్కువ అవసరం లేదుగా!'

అమ్మ ఆశ్చర్యం. అప్పుడు తెలిసింది నాతప్పు 'అదేనేం ఎక్కువయింది.'

◆ ◆ ◆ ◆

'ఏమండోయ్! హుష్! మిమ్మల్నె టీచరుగారూ! ఇక్కడ ఉండే పలుకరేమిటండీ?? విన్నారుగా, ఉద్యోగంవచ్చింది'? 'ఎవరికంటారేమిటండీ! మొన్నట్రైయినెక్కించి రాలేదుటండీ, తనకి, హమ్మయ్యా! ఒ ను నీళ్ళందుకుందురూ! మరీ గొంతు ఎండు తున్నట్లుంది. హబ్బె!! ఫలహారం ఎందుకండీ! ఏమిటీ' మిరపకాయ బజ్జీలే! బాబ్బాబు తర్వాత తప్పకుండా తీసుకుంటూ వస్తానండీ!'

◆ ◆ ◆ ◆

'ఇదిగో నమ్మాయి పిన్నీ! విన్నావుగా ఇదే విషయం' 'అయితే ఇందాకటినుండి నూ సందడివినలేదూ! సరిసరి! పోనీగానీ—ఉద్యోగం వచ్చింది. నాకు కాదు. బాబాయి దగ్గరనుండి ఇప్పుడే ఉత్తరం వచ్చింది. అద్సరేగాని ఇంకా బాబాయి రాలేదా?' నా నోరు తక్కువ మాట పడుతూ నాలిక కొరికింది. కారణం ఏమిటంటే పక్కనున్న బాబాయి మిత్రరత్నాన్ని చూచాను.

◆ ◆ ◆ ◆

'అయితే ఇవాళ గుడికి వెళదాం వస్తావుటే, వారం రోజులనుండి బయలుదేరమంటే బయలుదేరావు కాదు. ఇంక జనం ఎక్కువ అవుతారేమో తొందరగా తెములు' అక్కయ్యలు, వదిన ఒప్పించారెట్లాగో.

'ఏమమ్మా! నాలుగు రోజులనుండి సినిమాకి రమ్మంటే, రానని ఒకేమాట చెప్పుతున్నావు. ఇవ్వాళ వాళ్ళతో గుడికి వెడుతున్నావు కాబట్టి మాతో సినిమాకు రావల్సిందే. త్వరగా గుడికి వెళ్లిరండి. ఆ తర్వాత సినిమాకు_ బావలుకూడా వాళ్ళ కోరిక నెరవేర్చుకోవటానికి మళ్ళీ అప్లికేషన్ పడేశారు.

'సినిమాచూచి వచ్చిన దగ్గరనుండి పేకేట తప్పదు'_ అన్నయ్య కోరిక వెలిబుచ్చాడు.

'రేపు మార్నింగ్ షో_హిందీ సినిమా 'ఫియాకాఘర్'కి తప్పదు_చెల్లాయి ఆర్డరు. 'అన్ని చోట్లకి వెళ్ళటానికి వప్పుకున్నావు. ఆ ముసలావిడ ఎన్ని కబుర్లు పెట్టినా పోవు. ఏమయినా సరే రేపు అక్కడికి వెళ్ళి తీరాల్సిందే'_అమ్మ తీర్మానం.

'మీ ఫ్రెండ్ మాస్కూల్లో టీచరు. ఆవిడ నువ్వొచ్చినప్పుడు తీసుకురమ్మని అడుగుతుంది. రేపు స్కూల్లో పూజాచేస్తారు. నిన్ను తప్పకుండా తీసుకురమ్మంది మా టీచర్'_మేనకోడలు, మేనల్లుడు పట్లు బంధించి తీసుకు వెళ్ళటానికి తయారుగా ఉన్నారు.

అన్నిటికీ బుర్ర ఊపాను. కారణం? అక్కయ్యకి ఉద్యోగం వచ్చింది.

ఆ సంతోషంతో అన్నింటికీ అంగీకరించి పిన్నిగారింటికి వెళ్ళాను. వాళ్లకి చెప్పటానికి.

♦ ♦ ♦ ♦

పిన్నిగారింటికి వెళ్ళి అక్కడున్న గ్లాసందుకుని గడగడా త్రాగేసి 'ఉద్యోగం వచ్చింది' అన్నాను. సూక్ష్మగ్రాహి అయిన మా పిన్నిగారి మూడో అమ్మాయి గ్రహించింది. కాని మిగిలిన బుర్రలు నావంక ప్రశ్నార్థంగా తిరిగాయి. తననే చెప్పమని కను సైగ చేసి ఆ గ్లాసుక్రింద పెట్టాను. ఇంతకీ నేను మంచినీళ్ళనుకుని ప్రక్కనున్న పరమాన్న గ్లాసుతీసుకు తాగేశాను. ఇహ చూసుకోండి, పావుగంటవరకు ఎవరూ నవ్వు ఆపలా! హడావిడిగా వాళ్ళని గుడికి, సినిమాకు రమ్మని చెప్పివస్తుంటే మా పిన్ని అడ్డుపడింది 'నాలుగు జంతికలు తిని పోతే అని'' 'హబ్బే! ఇప్పుడు టైంలేద'ని ఆవిడ చేతిలోంచి ఓ జంతిక అందుకుని తుంపి నోట్లో వేసుకుంటూ బయల్దేరాను. ఓ ముక్క అప్పుడో కిళ్ళీ వేసుకొస్తున్న మా పిన్ని కొడుకు నోట్లో పడ్డది. 'అదేమిటీ?' అని ఆశ్చర్యపోయేంతలో 'ఉద్యోగం వచ్చింద'ని ఓ కేక పెట్టి,' అన్నయ్య నిన్ను సాయంకాలం తప్పకుండా రమ్మన్నారని సందేశం అందించి పరుగులాంటి నడకలో అడ్డం వచ్చిన వాళ్ళందర్నీ తిట్టి పోస్తూ ఇంటికి చేరాను.

♦ ♦ ♦ ♦

ఇదిగో! ఈ రూపాయి తీసుకెళ్ళి ఓ డజను అగ్గిపెట్టెలు తీసుకురా' అని పంపాను అన్నయ్యగారి అబ్బాయిని. అంతలో గుర్తొచ్చి మేనకోడల్ని పిల్చి కొబ్బరినూనె తెమ్మని ఓ కాయితం, సీసా, చేతికిచ్చాను. పాపం మా మేనకోడలు తెల్లబోయి 'ఇదేమిటి?' అంది నేను పర్సులోంచి డబ్బని తీసిచ్చిన విజిటింగ్ కార్డు చూపిస్తూ. అప్పుడు తిరిగి డబ్బులిచ్చి పంపాను. కొట్టుకెళ్ళిన మేనల్లుడు తీసుకొచ్చిన అగ్గిపెట్టెలు చూచి తాడెత్తున ఎగిరాను. 'అరిటిపళ్లు తెమ్మంటే, అగ్గిపెట్టెలు తెచ్చావేటిరా?' అని. వాడు అగ్గిపెట్లే తెమ్మన్నావనిఅన్నాడు. నా కేకలు వింటూ పాపం! వాడిమీద విరుచుకు పడతారేం 'ఇందాక నువ్వు తెమ్మన్నది అగ్గిపెట్టెలు కాని అరిటిపళ్లుకాదని 'మా వదిన చెప్పేదాకా నమ్మలేదు. దీనికంతకీ కారణం 'ఉద్యోగం వచ్చింద'న్న ఉత్సాహమే! ఆ ఉత్సాహంలో ఒకదానికీ, ఒకటి చెప్తున్నాను: చేస్తున్నాను. ఆ రాత్రి పడుకోబోతూ ఆనాడు వచ్చిన ఉత్తరాలు చూసుకుంటూంటే అందులో సగంపైగా మిత్రులు పంపిన శుభాకాంక్షలు. వాటిమధ్యనుండి,మామగారు వ్రాసిన కార్డులో 'పండుగ అయిన మరునాడు బయలుదేరివస్తున్నాను. ప్రయాణమై సిద్ధంగా ఉండు' అన్న వాక్యాలు కన్పించాయి.

'ఉద్యోగం వచ్చింద'న్న ఉత్సాహంతో దసరాపండుగ తొమ్మిదిరోజులు సరదాగా గడిపాము అందరము.

'తనకు ఉద్యోగం రావటం ఏమిటి? నాకు ఆనందం ఏమిటని' బావలు అడిగారు వేళాకోళంగా. 'అదింతే' అన్నారు.

'అక్కయ్యలు మా ఇద్దరిమధ్య నున్న అనుబంధమెరిగి'

♦ ♦ ♦ ♦

ఇప్పటికీ అప్పుడప్పుడు నేను అటు వెళ్తువుంటే 'ఉద్యోగం వచ్చింద'ని కేక వేస్తూ వుంటారు, బావలు, వదిన.

ప్రతి దసరా పండుగకు ఆ దృశ్యం మా కన్నుల ముందర కట్టినట్లు ఉంటాయి.

